# పేరులో నేమున్నది

నడిమింటి లలిత



మిత్రులు వెళ్లిపోతున్న దారిని దీ..లుగా చూస్తూ నిల్చుండిపోయాడు విశ్వేశ్వర్, పార్క్‌లో ఒక చెట్టుదగ్గర. మైకులోంచి వినిపిస్తూన్న రేడియో రణగొణ ధ్వనిగాని, చుట్టూ కాకిగోల చేస్తూన్న పిల్లల్నిగాని లక్ష్యపెట్టకుండా ఎక్కడో శూన్యంలో చూపు నిలిపి, ఎంకెక్కడికో దూరతీరాలకు మనసును పంపించాడు దుఃఖాన్ని నింపుకు రమ్మనిచెప్పి: తనెదురుగానే హీరోయిన్నెత్తుకుపోతూన్న విలన్ని చూస్తూ కూడ, రెండు తన్నే ధైర్యంలేక బిక్క చచ్చిపోయి నిల్చున్న హీరోలా వుందాతని భంగిమ. (దమ్ములేనివాడు హీరో ఎలాగయాడూ ? అనడక్కండి మరి. 'నాయకుడు ధీరోదాత్తుడు ధీర లలితుడు' అయివుండాలనే రూల్సు ప్రాచీన నాయకుడివి. 'అధునిక నాయక లక్షణాల్లో చేతకానితనం, చేవలేని తనం కూడ వో ఆకర్షణే' అని ఇంతకుముందే ఎందరో మహానుభావులు తమ తమ రచనలద్వారా నిరూపించారు.) విశ్వేశ్వరం మామూలుగానే వున్నట్లైతే వాతావరణం అలా వుండమన్నా వుండదసలు. ఆ రేడియో సంగీతానికి లయ బద్ధంగా విజిల్సు వేసుకుంటూ ఆనందిస్తాడు తనలో తను. ఇన్ని బఠాణీలో, ఇంత వేరుశెనగ పప్పో కొని తెచ్చుకొని తింటూ, తననిచూసి నవ్విన ప్రతీ చిన్నపిల్లాడి నోట్లోకీ గురిచూసి విసిరి మురిసిపోతూ వాళ్లతో సరిగ్గా ఆడుతాడు, అరుస్తాడు. నార్మల్‌గా విశ్వేశ్వరం ముఖం యొక్క పవరు సిక్స్టీ వోల్ట్సు అని చెప్తే...ప్రస్తుతం జీరో వోల్ట్సు అని చెప్పడానిక్కూడ కొంచెం ఆలోచించాలి. ఆ పార్క్‌లో అక్కడా అక్కడా పెట్టిన బొమ్మల్లో తనూ ఒక బొమ్మే అనుకొని నిల్చుండిపోయిన విశ్వేశ్వరం 'ఖయ్యి!' మన్న ముక్త కంఠధ్వనికి గూబ పగిలినంత పనై, త్రుళ్లిపడి, తన చేతులు పట్టుకు వ్రేలాడుతూన్న గుంట లిద్దరికీ చెరో రెండు జెల్లలూ కొట్టాడు, దోసెడు నూనింకి పోయేలా. సెనక్కాయలకి బదులు జెల్లకాయల రుచి తెలిసేసరికి హడిలిపోయి దూరంగా పోయారు పిల్లలు. బలవంతంగా వర్తమానంలో పడ్డ విశ్వేశ్వరం గట్టిగా 'హుఁ' అని నిట్టూర్చి, అంతవరకు గుండెల్లో స్టాక్ చేసిన గాలిని బయటికి తోలేసి, వుస్సూరుమని ఆ క్రిందనే రుమాలు వేసుకోవాలన్న ఇంగితంకూడ లేకుండా చతికిల బడ్డాడు. ఇంతవరకు నిట్టూర్పడం అంటే ఏమిటో, ఎలాగో అర్థంకాని మానవుడతడు, అని అంటే అబద్ధం కాదు. నిజమే. నిట్టూర్చవలసిన అవసరం వచ్చే దౌర్భాగ్యుడేం కాదు విశ్వేశ్వరం. హాయిగా కడు

పులో చల్ల కదలనివ్వకుండా నెల తిరిగే సరికిన్ని రాళ్ళ దోసిట్లో పోసే లెక్చరరుద్యోగం చేసుకుంటున్నాడాయె. మొహమాటాలకి పోయి ట్యూషన్లు లాంటి లొసుగులేమీ వుంచుకోలేదాయె వీధిజీవితం ఇది. పోనీ ఇంటిపోరా? ఇంతిపోరా ?... ఛ...ఛ...అదికూడ ఏం లేదు. ఎప్పుడు చూసినా వెల్లవేసిన గోడలో తెల్లగా నవ్వే చిన్నిబొమ్మరిల్లు లాంటి యిల్లతనిది. ఆ ఇంటి గుమ్మంలో ఇలా కాలు పెట్టే సరికల్లా కలకల నవ్వుతూ, గల గల నడుస్తూ ఎదురొచ్చే చలాకి చిన్నది విశ్వేశ్వరుని సతీమణి. అందునా మామూలు ఆడపిల్లా?...సన్నగా సళాకులా సన్నజాజిపువ్వులా, తొగడదారంలా,...ఇంకా యీ జనరేషన్ కర్థం అయేలా చెప్పాలంటే 'ది యంగ్ హిందీ హీరోయిన్'లా స్మార్ట్‌గా వుండే ఛార్మింగ్ లేడీ, సదరు విశ్వేశ్వరుని భార్య ప్రేమలీల. కావాలంటే ...ఇంకా చెప్పాలంటే మరో రెండు అడిషనల్ క్వాలిఫికేషన్లూ వున్నాయి ప్రేమలీల రేడియో ఆర్టిస్టు. అడపాదడపా లలితసంగీతమూ, ఈ మాసపు పాటా పాడుతూంటుంది. కాని వర్తమానంలో ఆమె కేవలం రేడియో ఆర్టిస్టు మాత్రమే కాదు, చిన్న సైజు రచయిత్రి కూడ. అప్పుడూ అప్పుడూ పొట్టి పొట్టి కథలూ, చిట్టి చిట్టి వ్యాసాలూ గిలుకుతూంటుంది. పోనీ...తనకున్న ఇన్ని క్వాలిఫికేషన్లు చూసుకొని ఆ భామాలలామ భర్తనేమన్నా నిర్లక్ష్యం చేస్తోందా?... తప్పండీ!...అన్నవాళ్ల కళ్లు పోతాయ్. ఎప్పుడో ఏకాంతంలో ఏదో సరదాగా 'నాథా! నా పాదసేవ... లేని నీ జన్మ మేలా...' అని పాడినా, అంత చిన్న విషయాన్ని స్పోర్టివ్‌గా తీసుకోలేని, అంత మాత్రం సెన్సాఫ్ హ్యూమర్‌లేని జడుడేం కాదు విశ్వేశ్వరుడు. పైగా 'నీ చరణ కమలాల నీడయే చాలు, ఎందుకే వో దేవి నందనవనాలూ?...'అని గొంతు కలిపే సరసుడు కూడ. ఇంక పతిదేవుడి క్కాస్త తలనొప్పొచ్చినట్టుగా అనుమానం తగిలితే చాలు ...అమృతాంజనం మర్దనంచేసేస్తూ, జాలి చూపులు చూస్తూ దిగాలుగా కూర్చుండిపోయే వేళ ఈ ప్రేమ లీల. అయిన ఈ విశ్వేశ్వరుడెందుకు విశ్వసింపవలసి వచ్చె? ప్లీజ్ రీడ్ ది ఫాలోయింగ్ లైన్స్. అరుదైన ఈ విశ్వేశ్వరుని నిట్టూర్పుకి కొంచెం కారణం ఇంతకు మునుపు వెళ్ళిన మిత్రబందం అని చెప్పొచ్చు. అంటే వాళ్లేమన్నా అక్కణ్ణి తిట్టేరా తిమ్మేరా?...అబ్బబ్బే అదేం కాదు. వాళ్ళలో నాళ్ళు కొన్ని ప్రశ్నలేసుకున్నారంతే. పోతే...వాటి జవాబులు విశ్వేశ్వరం దగ్గర టిక్కడిపోయాయి. అక్కడే వొచ్చింది చిక్కు. 'రచయిత్రికి, లేక గాయనికి, లేక తదితర ప్రత్యేక స్త్రీకి, భర్తవలన ఒనగూడు అదనపు ప్రయోజనము లేమి?' ఇది సహోద్యోగి భాస్కర్రావు ప్రశ్న. 1. 'రచయిత్రి అయినచో, కథావస్తువులకు తడుముకో నవసరములేదు. భర్త తిట్టుకో నవల, మెప్పుకో కథ వ్రాయవచ్చును. 2 సంకుచితముగ నున్న తన పేరునకు భర్త పేరును చేర్చి విస్తృతము గావించుకొనవచ్చును...'

'షటప్' రెండో మిత్రుని మాటలను తన గర్జనతో నిలిపేసి మరో ప్రశ్న బనాయించాడు ఉద్దండ పిండం రామకృష్ణ. 'సాధారణ స్త్రీ భర్తకు, అసాధారణ (అనగా టాలెంటెడ్) స్త్రీ భర్తకు గల బేధము లేమి?' '(ఇక్కడ స్త్రీ భర్త అనగా స్త్రీ యొక్క భర్త అని గ్రహించండి విమర్శక సింహాలూ! స్త్రీ భర్తలూ, పురుష భర్తలూ అని రెండు విధాలా? అంటూ ఆగ్రహించకండి నా పైన.) గొంతు సవరించుకున్నాడు మోహన్.

'సాధారణ స్త్రీ భర్త తన భార్య వంటకములను, ఇంటి సర్దుబాటును, దిద్దుబాటును మాత్రమే విమర్శించుటకు (అనగా కేవలము తిట్టుటకు) వీలగును, కాని అసాధారణ స్త్రీ భర్త అదనముగా ఆమెలోని 'కళ'ను కూడ తిట్టుటకు వీలున్నది. సాధారణ స్త్రీ భర్తనుండి సంసారపక్షమైన సంభాషణమునే ఆశించునుగాని, అసాధారణ స్త్రీ ముఖ్యముగా రచయిత్రి, భర్త నుండి వుద్యోగపరమైన సంభాషణలు సాగించుట కొక విధంగా కుతూహల పడుచుండును. అందులకు కారణం కేవలం తన రచనలలో ఆ వాతావరణము చిత్రించుటకే. (ఉదాహరణకు......రచయిత్రి భర్త ప్లీడరనుకోండి, అనుకుందాం...దానికేం?...... ఇంక ఆమె రచనల్లో తరుచు కోర్టుసీన్లు, పాయింట్స్ లోపించిన పిడివాదనలు కోకొల్లలుగా వుంటాయి) తరువాత ... సాధారణ స్త్రీ భర్త తన భార్యలోని తెలివిలేమిని యధేచ్ఛగా యెత్తి చూపించగలడు. అసాధారణ స్త్రీ భర్తకా స్వేచ్ఛ లోపించి యుండును. అతి ముఖ్యమైన విషయ మేమనగా...సాధారణ స్త్రీ భర్త యొక్క పేరు కేవలము వారి బంధువర్గమునకు మాత్రమే విదితము. అసాధారణ స్త్రీ భర్త పేరట్లుగాక (రొట్టెలై) యావదాంధ్ర పత్రికా పాఠకులకు సువిదితము.' అక్కడితో అలిసిపోయి, ఆగిపోయాడు మోహన్. అంతవరకు నోరు తెరచి బెట్టుకొని వింటూన్న విశ్వేశ్వరం తక్కున నోరు మూసేసుకుని, సైమల్టేనియస్‌గా తల వంచుకున్నాడు. 'గుడ్ బోయ్. మంచి పాయింట్లే చెప్పావ్' అంటూ అభినందించాడు రామకృష్ణ.

'చిన్న...బుల్లి డౌటు మాష్టారూ?' అంటూ కీచుమన్నాడు వెంకటేశ్వర్లు. 'నాకు తెల్సోయ్ నీ డౌటూ... రచయిత్రి భర్త పేరెలా నలుగురికీ తెలుస్తుందనా? వెర్రి శిశువా!... కళ్ళెదుట సజీవ నిదర్శనం చూస్తూ కూడా నీకీ అనుమానమెందుకొచ్చింది? ప్రేమలీలా విశ్వేశ్వర్'వో రచయిత్రి...'. 'అర్థమై పోయింది గురూగారూ!' అంటూ మధ్యలోనే ఆపేసి చెంపలు వాయించుకుంటూన్న వెంకటేశ్వర్లు వైపు యోగిలా చూశాడు భోగియైన రామకృష్ణ. ఆ తర్వాత నలుగురూ కంగ్రాట్యులేషన్స్ పేరిట విశ్వేశ్వరం చెయ్యి సలిపేవరకు కుదిపి ఎవరి దార్న వారు పోయారు. అయితే ఇంత చిన్న విషయానికే అంత పెద్ద నిట్టూర్పు వదలాలా? అంటే అక్కర్లేక పోవచ్చు. ఇంతకు పూర్వమే ఈ పేరు తాలూకా స్పర్థ విశ్వేశ్వరుడిలో రేగి వుండవచ్చు. వచ్చేమిటి?...వచ్చింది నిశ్చయంగా. పెళ్లయిన కొత్తల్లో వోసారి రేడియో అనౌన్సరు 'లలిత సంగీతం...గాయని...శ్రీమతి ప్రేమలీలా విశ్వేశ్వర్' అని ఆ క్రొత్త పేరుకి ప్రారంభోత్సవం చేసినప్పుడు, అది వింటూ వుబ్బిపోయాడు విశ్వేశ్వర్. తన ప్రియ సతి పేరెంత రమ్యంగావుంది! అని మురిసిపోయాడు. ఆ తర్వాత ఏదో

పత్రికలో అంత పొడుగు పేరుతో పడిన వో పొట్టి కథను చూచి చిరుగా నవ్వుకున్నాడు పెద్దమనిషిలా. కాని తరుచు, ఇంచుమించు ప్రతీ పత్రికలోనూ ఆపేరు కన్పిస్తూ, విన్పిస్తూండటంతో అతని హృదయం చిర్రుబుర్రు మనడం మొదలు పెట్టింది. విలోమానుపాతంలా భార్య పేరుకు ప్రాముఖ్యత హెచ్చుతున్న కొద్దీ భర్త పేరు ప్రాముఖ్యత తగ్గుతూన్నట్టుందేమో!' అని అనుమానిస్తూన్న ఆత్మని ఠంగునమొట్టింది హృదయం. 'అనుమానం ఏమిటి ? మొద్దు పెద్దమ్మా ! అది కటికనిజం అయిపోతేనూ' అంటూ. తదాదిగా విశ్వేశ్వరుడి హృదయం వీర భద్రావతారం దాల్చింది. ఇవాళ మిత్రులు ధూపం వెయ్యడంతో అది కాస్త వీరాంగం వెయ్యసాగింది. చీకటిలో చిక్కబడిపోయినా, వీధిదీపాలింత స్పష్టంగా వెలుగుతున్నా, వీడింకా ఇవాళ కదల్డేం ? అని కళ్లుచికిలించుకొని చూస్తూన్న చుక్కల్ని మరి చూడలేక, మెడ నెప్పెట్టి, లేచి, తప్పనిసరిగా గృహోన్ముఖుడయ్యాడు విశ్వేశ్వరం.

'అదేవిటండీ ? ఇవ్వాళ డావఁదం ఎందుకు తాగరూ?' లుంగీ అందిస్తూ ఆశ్చర్యంగా అడిగింది ప్రేమలీల. 'ఆవఁదం తాగడ మేమిటి?' అంటూ పరధ్యానంగా ప్రశ్నించాడు పతి దేవుడు. 'మరాముఖం ఎందుకలా వుంది?' నిలదీసింది భార్యామణి. తేరుకున్నాడు విశ్వేశ్వర్. 'విట్టనవ్వొచ్చేదేగనీ, ఆ నవ్వే వోపిక నాకిప్పుడు లేదోయ్.' అంటూ కుర్చీలో చేరబడ్డాడు. పాపం.? ఈపేరు తెచ్చిన పేటాపన ఇంతా అంతా కాదు తన ప్రాణానికి. ఇంతకుముందో సారి మృదువుగా కదిపి చూశాడీ విషయాన్ని, 'హాయిగా. సింపుల్‌గా నీపేరే వుంచుకోక చివర నన్నూ కలిపావెందుకూ?' అంటూ. తియ్యగా నవ్వేసింది ప్రేమలీల. 'బ్రతుకులోనే యిద్దరం భాగస్వాముల మయాం. ఇంక యీ చిన్నచిన్న విషయాల్లో భాగస్వామ్యం. వుంటే ఏం? అయినా పేర్లో ఏవుంది పోనిద్దురూ!' అంటూ గాలికి వదిలేసింది ఆ సమస్యని. విశ్వేశ్వరుడు లైక్‌చేసే కోణంలోకి కళ్లు తింపి. 'నేనూ అదే అంటున్నా. పేర్లో ఏముంది? అందుకే నాపేరు చేర్చొద్దు.' అన్నాడు కొద్దిగా 'వీక్' అయిన విశ్వేశ్వరం, మృదువుగా ఆమె ముంగురుల్ని సర్దుతూ. 'హబ్బా ! నాకీపేరే బాగుంది.' అంటూ గునుస్తూ, అతని మెడకీ, భుజానికీ మధ్యవున్న కొద్ది జాగాలో ముఖాన్నిరికించుకుంది ప్రేమలీల. నిస్సహాయంగా పళ్లు కరచుకొని, రెండు నిమిషాలు వూపిరినిలిపి, ఆతర్వాత తాపీగా ఒదిలాడు. (అంతేగానీ 'హుఁమ్మని నిట్టూర్పలేదు.) ఆదారి, లాభంలేదని అప్పుడే తేలిపోయింది. గతమంతా కళ్లముందు తిప్పుకుంటూ, భోజనం కానిచ్చి శయనించిన విశ్వేశ్వర్, చిటపట లాడుతూన్న మనస్సుని సమాధాన పరిచే ధోరణిలో చెయిజాపి రేడియో ఆన్ చేసాడు. వెనువెంటనే అతనిలోని వీర భద్రుడు 'హ్హాఁ' మని లేచాడు ఆవేశంతో వూగిపోతూ. కారణం...ఆ మాస (సిక)పు పాట పాడిన గాయనిపేరు విన్పించడమే. టపీమని రేడియో పీకనొక్కి అదేవూపున 'లీలా !' అంటూ గావుకేక పెట్టాడు. పెరట్లో కంచాలు తోలుతూన్న ప్రేమలీల, యిరుగు పొరుగు కొంపల్లో దేనికి నిప్పంటుకుందో అర్థంకాక, పరుగు పరుగున వచ్చేసి 'హేఁవిటి?' అంది వగర్చుతూ. 'ఇదిగో ! ఆఖరుసారిగా అడుగుతున్నాను. నీపేరు చివర నాపేరు తీస్తావా తియ్యవా ?' ఖంగుమంది విశ్వేశ్వరుడి కంఠం. అదాటుగా మీదపడిన చైనా దుండగుల్ని చూచి బిక్కచచ్చిపోయిన ఇండియాలా వెర్రి చూపులు చూసిన ప్రేమలీల ఆ మరుక్షణంలోనే భారత వీరయోధుడిలా తేరుకొని, హేలగా వో నవ్వునవ్వి, 'ఇంతేనా? ఇంకేమిటో అనుకొని చేతిలోపనలా ఒదిలేసొచ్చాను. వంటిల్లు సర్దేసొస్తానాగండి. తీరిగ్గా కూర్చుని రాత్రంతా కాట్లాడుకుందాం.' అంటూ సుతారంగా వెనుదిరిగింది.

'వీల్లేదు. ఇదిప్పుడే ఫైసలైపోవాలి కావాలంటే తగువైపోయాక తీరిగ్గా తెల్లవారు జామున సర్దుకో నీ వంటిల్లు.' అంటూ హుంకరించాడు.

బాగుందండి సొద. ఇంతవరకూ ఇలా రాసుకుని, ఇకముందు మళ్లీ మీపేరు చెరిపేసి రాసుకుంటే నలుగురూ నవ్వరూ? అయినా వుండీ వుండి మీ కేమొస్తుందబ్బా ! ఇలా రెచ్చిపోతూంటారు.' అంటూ విసుగులో అందం ప్రదర్శిస్తూ ముక్కు విరిచింది, కళ్లు చికిలించింది, పెనాల్తో నవ్వబోయి ఆగిపోయింది 'రోగం' అన్న మగసింహం గర్జింపు వింటూ. 'పున్నమికీ, అమావాస్యకీ రెచ్చిపోవడానికి నేనేమీ పిచ్చివెధవని కాను. తెలుసా ? నాకున్న పేరేదో నాకుంది. ఆ వున్నపేరు నాకు చాలు. అదనంగా నువ్వు నా పరువు పెంచొద్దు. వింటున్నావా ? నీ పేరేదో నువ్వు నిలబెట్టుకో. అంతే తప్ప నాకోసం కష్టపడక్కర్లేదు. ఇలాటి తోకపీకుడు వ్యవహారాల్నాకు నచ్చవు. అర్థమైందా ? ... ఇటుపై నింక నీ కథలూ, గిథలూ ... అన్నీ నీ పేరుతోనే పంపించుకో. చివర నాపేరు తగిల్చావా... నీ కథలు పోస్ట్‌బాక్స్‌లో పడేబదులు వీధి కాలవల్లో విహరిస్తాయి: గుర్తుంచుకో' అంటూ కథాకళి ప్రదర్శించాడు. 'అర్ధరాత్రంకమ్మ శివాలపే బాగుంది లెండి. పడుక్కోండి.' అంటూ నిర్లక్ష్యంగా మరోసారి అవతలికి నడవబోయింది ప్రేమలీల. జబ్బవూడొచ్చేలా పట్టుకు లాగాడు విశ్వేశ్వరం. అదాటుగావచ్చి మంచం మీద పడింది లతాంగి. ఆ అపసవ్యపు పడటంలో మంచంకోడు, పక్కలో కఠినంగా ఒత్తుకుంది. ఆడప్రాణం కళ్లనీళ్ల పర్యంతమైంది. పర్యవసానం?... ఆమెలో స్త్రీ సహజమైన మొండితనం ఉవ్వెత్తున లేచింది. 'నే మార్చుకోను. ఏం ? నేనేం నీతిమాలిన పనిచేశానూ ? నా భర్తపేరే రాసుకున్నాను గానీ, ఇంకెవడో తలమాసిన వాడి పేరు రాసుకోలేదుగా.' అంది సర్దుక్కూర్చుని గట్టిగా. తాతలకి వినికిడప్పేలా, నమ్మకంగా చెంప మీద పెద్ద ఖర్చు కిచ్చేశాడు విశ్వేశ్వరుడు. ఒకే ఒక్క క్షణంలో ప్రేమలీల ముఖంతో పాటు చెవులు, మెడకూడ ఎర్రగా అయిపోయాయి. రెండు కళ్లూ నాలుగు వైపుల్నించీ జలపడ్డ ఒకటోరకమైన బావుల్లా అయిపోయి, ఆ నీరు వూరి వూరి, గట్టు దాటి, మైదానాల్లాంటి చెంపలమీద


# పేరులో నేమున్నది

స్వేచ్ఛగా ప్రవహించింది. సరిగ్గా అదే క్షణంలో విశ్వేశ్వరుని ఆత్మ, హృదయమూ వొక గటి కిక్కుతో బార్డర్ అవతల పడేసింది. వీరభద్రుడు స్పృహ తప్పిపోయాడు. ఫలితంగా అంతవరకు బాయిలింగ్ పాయింట్ దగ్గరున్న విశ్వేశ్వరుడి రక్తం తుస్సుమని మెల్టింగ్ పాయింటుకి దిగజారి పోయింది. విశ్వేశ్వరుని చేతులు రెండూ ముందుకొచ్చి ప్రేమలీలను గుండెలకి దగ్గరగా జరిపాయి. 'వెధవ పనే చేశానోయ్ ప్రేమా! నిన్ను కొట్టాలన్నది నా వుద్దేశమే కాదసలు. పోనీ నన్ను కొట్టెయ్. చెల్లుకి చెల్లు.' అంటూ బుద్ధిగా చెంపందించాడు, పశ్చాత్తాపం అంతా ముఖంమీద పులుముకొని. 'ఛీఛీ! ఒదలండి నన్ను.' అంటూ గింజుకుంది దెబ్బతిన్న స్త్రీలలామ. 'నా మాటలు పూర్తిగా విను మరి. ఇప్పుడు నే చేసిన పని సాధారణంగ తీసుకొని నన్నో దుర్మార్గపు మొగుడిగా చిత్రిస్తూ వో కథ...పోనీ వో నవల రాసెయ్. కానీ...నీ పేరు చివర నా పేరు తగిలించొద్దు. ఎందుకో అలా చేస్తే నా కిష్టం వుండడంలేదు. ఈ చిన్న విషయంకోసం నువ్వు హింస పడొద్దు. నన్ను పెట్టొద్దు ఏం?' అన్నాడు ముద్దాయింపుగా. అంటూ పది ...ాడు. 'ఛీ! సిగ్గులేని మనుష్యులు.'

అంటూ రివ్వున లేచి వెళ్ళబోయి 'పుట్టి బుద్ధెరిగాక మా అమ్మే నన్నెప్పుడూ కొట్లేదు. ఈనాటికి మీ చేత...' అంటూ తర్వాతి మాటలు వెక్కిళ్ళాపేస్తూంటే తలుపట్టుకొని బావురుమనబోయి, అంతరంగంలోని రచయిత్రి హుంకరించడంతో వంటింట్లో కూర్చొని కరువుతీరా, రాగయుక్తంగా ఏడ్చింది గాయని ప్రేమలీల. చేసిన పనికి సిన్సియర్‌గా బాధ పడ్డాడు విశ్వేశ్వరం ఆ రాత్రంతా.

ఆ తర్వాత వో వారం పదిరోజులు ఇంట్లో కోల్డ్‌వార్ నిర్విరామంగా సాగింది. భార్యా భర్తలిద్దరికీ మాటల్లేవు. చూపులసలే లేవు. పాత తారలు రేట్లు పెంచి బిర్ర బిగిసిపోతే, ఆ అవకాశాలు వాడుకునే నూతన తారల్లా, ఆ నీరవ నిశ్శబ్ద వాతావరణంలో వంటింటిపాత్రల 'పాత్ర'కి ప్రాముఖ్యత హెచ్చింది. వంటైపోయిందనడానికి సూచనగా గిన్నెమీద 'ఖణేల్' మని నర్తించే గరిటె, తెమనగానే టేబిల్ మీద 'దభేల్'మని కూలబడే కాఫీగ్లాసూ హీరోయిన్లనుకుంటే...కాలేజీకి వెళ్ళే వేళప్పుడు 'టక్...టకా టక్' మనే బూట్లూ ఇంటికొచ్చేసరికి 'ధన్ ధన్'మని డైలాగు లప్పగించే పుస్తకాలూ హీరోల లిస్టులో వేసుకోవచ్చు. ఈ లోపులో ప్రేమలీల తన

ఆరోప్రాణం స్నేహితురాలికి లిఖితరూపం పరిస్థితుల్ని చూపించింది. వోసాయంత్రం దానికి వచ్చిన జవాబు చదువుకుంటూనే 'కిసుక్కు'మని నవ్వుకొని, అది (ఆ ఉత్తరం) పతిదేవుడి కంటబడేలా నిర్లక్ష్యంగా టేబిల్ మీద విప్పి పడేసింది. బూట్లు టక టక లాడించుకుంటూ వచ్చిన విశ్వేశ్వరాన్ని చూస్తూనే వంటింట్లోకి దూరింది. రివాజుగా పుస్తకాలు గిరాటేయబోయిన విశ్వేశ్వరం టేబిల్ మీద వుత్తరాన్ని పురుగును తీసినంత సొంపుగా మునివేళ్ళతో తీశాడు. 'చదవనా ఒద్దా?' అని సందేహిస్తున్న మనసుని 'ఎప్పుడూ లేని అరమరికలిప్పుడెలా వస్తున్నాయి. చాల్లే' అని మందలించింది ఆత్మ. నిస్సంకోచంగా విప్పి, నిర్భయంగా చదివేశాడు విశ్వేశ్వరం. ఆనాడు విశ్వేశ్వరం చదివిన ఆ వుత్తరం ఏనాటికైనా సరే...అసాధారణ స్త్రీలోకం (అనగా ఏమిటో ముందే చెప్పాగా) లైన్‌బై లైన్ కంఠస్థం చేసుకోవాల్సిన వుత్తరం. బ్రతికున్నంతకాలం రోజూ నిశ్చల మనస్సుతో పారాయణ చెయ్యదగిన వుత్తరం. సరే బాగానే వుంది. బట్ వాటార్ద కంటెంట్స్ ఇన్ దట్ నోబుల్ లెటర్? ఇదిగో మహాశయా! అక్షరాల మీ ముందే పరిచేస్తున్నాను. చిత్తగించండి. 'మై డియర్ అండ్ నియర్ ప్రేమా! నీ 'వుత్త'రం పూర్తిగా చదవగలిగాను. విషయాలు నిరుచగా చెప్పగల్గాలా వున్నాయి లెమ్మా!! 'పేరు తెచ్చిన ప్రళయం' అనే పేరుగల మా (మీ) సినిమాలో హీరోకి పోర్షను రాదు; యాక్షను లేదు. అటువంటి సందర్భాల్లో హీరో ఎప్పుడూ కూడ ఒకే ఒక్క చెంపపెట్టుతో ఆగిపోకూడదు. రెండు గుద్దులూ, మరో రెండు తాపులూ వుండాలి. బ్రూట్, ఇడియట్, రోగ్...లాంటి తిట్లు వాడాలి. తిట్లూ, దెబ్బ ఆల్టర్నేట్‌గా వాడాలి. అదే సరైన పద్ధతి. పోన్లే ... అదలా ఒదిలెయ్. ఎందుకంటె హీరోయిన్ పోర్షను చూస్తే హీరో వెయ్యిరెట్లు మెరుగు. మొదట్నుంచీ కొసవరకు హీరోయినువస్తే తప్పుడు డైలాగులే. అలాంటి సీన్స్‌లో హీరోయినెప్పుడూ కూడ 'ఛీఛీఛీ!' అని కుక్కలు మీద పడుతున్నట్టు యుంజాయించుకో కూడదు. సంపుగా, చిన్న నవ్వు



నవ్వాలంతే. ఇక్కడ డైలాగ్స్‌కన్నా ఫేషియల్ ఎక్స్‌ప్రెషన్సెక్కువగా కన్పించాలి. 'వాక్యాన్ని పదాల కర్థాలు తెలీవు. కొంచెం చెబ్దురూ! పేరు మార్చడి కేం పోయింది అలాగే చేద్దాం' అంటూ ముద్దు లొలికించి, 'సీతాపతి. శ్రీనాథుడు, గిరిజారమణుడు, రుక్మిణీ వల్లభుడు...' ఇలాటి పదాల కర్థమేమిటండీ ?' అనడగాలి ఎంతో అమాయకంగా. హీరో చెప్తాడు కోపంగానో, శాంతంగానో. అప్పుడు మళ్లీ 'మరీ...మరీ...సీత 'యొక్క' భర్త శ్రీదేవి 'యొక్క' పతి...ఇలా అర్థాలు చెప్తే ఎప్పుడూ... 'ఆ భర్తకి ఒరిజనాలిటీ ఏదండీ ?' అనడగాలి ఇంకా ముగ్ధత్వం నింపుకొని కళ్లు విశాలం చేసుకుంటూ. 'పురాణాల్లోని అంతటి టాప్‌మోస్ట్ హీరోలకే లేని ఒరిజనాలిటీ నీకేముందోయ్ ?' అన్నట్టు రెప్ప టప టప లాడించాలి. ఆ సీతకన్నా, శ్రీదేవికన్నా, గిరిజకన్నా వెయ్యిరెట్లు నయం మేం. మిమ్మల్ని పూర్తిగా వెనక్కి తొయ్యకుండా మా ప్రక్కనే నిల్చోబెట్టుకుంటున్నాం. గుర్తించారా? మా విశాల హృదయం?' అన్నట్టుగా ఓ అలతి నవ్వు నవ్వాలి. బస్. అయ్యగారి ఆట కట్టయిపోతుంది (ఇది రూలు) హీరోయిన్ తన పాత్ర నర్థం చేసుకు నటిస్తే ఇది క్లాస్ పిక్చరే అయివుండును ...గనీ...నా విమర్శ పంపాను. తర్వాత నీ యిష్టం మరి... నీ స్నేహితురాలు.'

చదివి యథాస్థానంలో గప్ చిప్‌గా ఆ ఉత్తరాన్ని పడేసిన విశ్వేశ్వర్, పేరు గొడవ అక్కడితో వదిలేసి, ఆ రాత్రి భోజనాల దగ్గర రెండో కంచం అవతలికి నెట్టేసి, తను తింటున్న అన్నంలోనే భార్యామణికి షేరిచ్చి, సంధి పత్రం మీద సంతకంచేసి తన కథ సుఖాంతం చేసుకున్నాడూ...అని నేనిలా ఇంత క్లియర్ కట్‌గా రాసేస్తున్నాను గనక మీకు తెలిసిపోతుంది. కాని... 'ఆ ఉత్తరాన్ని నూటొక్కసారి ముద్దు పెట్టుకొని, మొట్టమొదట విశ్వేశ్వరం తనకి కొన్న సిల్కు చీర మడతల్లో దాన్ని భద్రంగా దాచుకుంది 'ప్రేమలీల' అని నేను చెప్పడం లేదు కదా! మరి మీకెలా తెలుస్తుంది పాపం ! ? ●